# గోవిందరాజుల గుట్టపై.. రాజకీయ పెత్తనం



- అర్చకుల మధ్య చిచ్చు పెడుతున్న కార్పొరేటర్
- తనకు వ్యతిరేకంగా వ్యవహరిస్తున్నారంటూ గరం
- పోలీసులనూ తప్పుతోవ పట్టించిన వైనం
- రెండు గ్రూపులుగా విడిపోయిన పూజారులు
- పోటాపోటీగా ప్రెస్ మీట్ లు
- ఒకరిపై మరొకరు ఆరోపణలు

**వరంగల్ వాయిస్, వరంగల్ బ్యూరో :** వరంగల్ నగర నడి మధ్యన గోవిందాద్రి కొండపై స్వయంభుగా వెలిసిన శ్రీదేవి, భూదేవి, నీలాదేవి సతీ సమేతుడైన శ్రీ గోవిందరాజస్వామి దేవస్థానంలో స్థానిక కార్పొరేటర్ తన అనుచరులతో కలిసి రాజకీయ పెత్తనం చెలాయిస్తున్నారు. తను చెప్పిందే వేదం అన్నట్లుగా వ్యవహరిస్తూ అర్చకులకు చుక్కలు చూపిస్తున్నారు. కాదంటే దాడి చేయడమే నైజంగా పెట్టుకున్నట్లు ఆరోపణలున్నాయి. ఆలయ అర్చకుడిగా గత 30 సంవత్సరాల నుంచి స్వామివారికి ధూప, దీప, నైవేద్యాలు సమర్పిస్తున్న వరియోగుల శ్రీనివాస స్వామి బృందాన్ని కాదని మరో వర్గాన్ని రెచ్చగొట్టి ఆలయంలో పూజలు చేసేలా ఉసిగొల్పుతున్నారంటూ ఆరోపిస్తున్నారు. రెండు గ్రూపులుగా విడిపోయిన అర్చకులు సోమవారం పోటాపోటీగా ప్రెస్ మీట్ లు పెట్టి ఒకరిపై ఒకరు ఆరోపణలు చేసుకోవడం వివాదాస్పదంగా మారాయి.

### అనారోగ్యం కారణంగానే..

గత 30 సంవత్సరాలుగా స్వామివారికి ధూప, దీప, నైవేద్యాలు సమర్పించడంతో పాటు స్వామివారి అభివృద్ధికి పాటుపడున్నానంటూ అర్చకులు వరియోగుల శ్రీనివాస స్వామి తెలిపారు. ఆలయ ప్రాంగణంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో కార్పొరేటర్, అతను అనుచరులు చేస్తున్న ఆగడాలను ఎండగట్టారు. అనారోగ్యం కారణంగా గత కొన్ని మాసాలుగా ఆలయంలోకి ప్రవేశించలేదని, ఆరోగ్యం కొద్దిగా కుదుట పడడంతో ధనుర్మాస ఉత్సవాలను నిర్వహిస్తానంటూ దేవదాయ శాఖ ఈఓ, అసిస్టెంట్ కమిషనర్ కు సమాచారం ఇచ్చినట్లు వెల్లడించారు. అందులో భాగంగానే ఆదివారం శ్రీ గోవిందరాజస్వామి ఉత్సవ మూర్తి ఆలయంలో నా సహచర అర్చకులైన వారియోగుల మురళీకృష్ణ, అరుణ్ స్వామి, వరయోగుల ప్రసాద్, వరయోగుల లక్ష్మణ స్వామితో కలిసి అభిషేకాదిక కార్యక్రమాలు నిర్వహించామన్నారు. ఇదే సమయంలో గుట్టపైకి చేరుకున్న జగన్నాథం కిరణ్ స్వామి, జగన్నాథం రాము ఎలాంటి అనుమతులు తీసుకోకుండానే గుట్టపై ఆలయముఖ ద్వారా తలుపుల తాళములను పగులగొట్టి పూజా కార్యక్రమాలు నిర్వహించారని ఆరోపించారు.


### పోలీసులకు ఫిర్యాదు..

గుట్టపై ఆలయముఖ ద్వారం తలుపుల తాళాలను పగులగొట్టిన విషయాన్ని వెంటనే డయల్ 100 ఫోన్ చేసి సమాచారం అందించామని వరియోగుల శ్రీనివాస స్వామి తెలిపారు. గుట్ట పైకి చేరుకున్న పోలీసులకు మద్యం చేవించి పూజలు చేస్తున్న జగన్నాథం రాము దర్శనమిచ్చారు. దీంతో మద్యం సేవించి పేజలు చేయడం ఏమిటి? తాళులు ఎందుకు పగులగొట్టారని ప్రశ్నించగా మా అన్న జగన్నాథం కిరణ్ స్వామితో కలిసి తాళాలు పగుల గొట్టినట్లు జగన్నాథం రాము ఒప్పుకున్నారన్నారు. ఈ విషయంలో విచారణ చేస్తుండగానే స్థానిక కార్పొరేటర్ చింతాకుల అనిల్ కుమార్ అనుచరుడు చెమ్మాల సాగర్ గుట్ట పైకి వచ్చి విచారణ చేస్తున్న పోలీసులను అడ్డుకునే ప్రయత్నం చేసినట్లు ఆరోపించారు. మీతో కార్పొరేటర్ మాట్లాడుతాడంటూ పోలీసులకు ఫోన్ ఇచ్చినట్లు వెల్లడించారు. అయితే ఈ విషయంలో స్థానిక కార్పొరేటర్ కు ఏమిటి సంబంధమని వారించే ప్రయత్నం చేయగా మాపైనే దుర్భాషలాడారంటూ ఆరోపించారు. గతంలో కూడా స్థానిక కార్పొరేటర్ చింతాకుల అనిల్ కుమార్, చింతాకుల సుసిల్ కాలభైరవ దేవాలయ పూజారైన వరియోగుల మురళీకృష్ణతోపాటు వారియోగుల ప్రసాద్ పై దాడి చేసిన సంఘటనలు ఉన్నాయన్నారు. ఈ విషయమై గతంలో స్థానిక పోలీస్ స్టేషన్ లో లిఖితపూర్వకంగా వీరిపై ఫిర్యాదు చేసినట్లు వెల్లడించారు. ఇటీవల దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖను కలిసి స్థానిక కార్పొరేటర్ అయిన చింతాకుల అనిల్ కుమార్, చింతాకుల సునీల్ ఆగడాలపై ఫిర్యాదు చేశామన్నారు. మా ఆలయ అర్చకుల మధ్యలో విభేదాలు సృష్టిస్తున్నాడని, అకారణంగా మాపై దాడి చేయిస్తున్నాడని, తక్షణమే స్థానిక కార్పొరేటర్ పై చర్యలు తీసుకోమని లిఖితపూర్వకంగా కోరినట్లు వెల్లడించారు. అనంతరం గుట్టకింద ఉత్సవ మూర్తుల ఆలయం వద్దకు విచ్చేయగా ఉత్సవమూర్తుల ఆలయం తాళములు కూడా పగలగొట్టడం జరిగినది తదుపరి అక్కడికి కూడా కార్పొరేటర్ అనుచరుడైన చెమ్మాల సాగర్ విచ్చేసి పోలీసుల ముందే మాతో వాగ్వాదానికి దిగాడని ఆరోపించారు. దేవాలయం విషయంలో స్థానిక కార్పొరేటర్ అత్యుత్సాహం చూపిస్తూ అర్చకులను అయోమయానికి గురి చేస్తున్నారన్నారు. శ్రీ గోవింద రాజుల స్వామి దేవాలయంలో రాజకీయ పెత్తనం లేకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.

### దాడులు జరుగలేదు..

గోవిందరాజుల గుట్ట ఆలయంలో అర్చకులపై ఎలాంటి దాడులు జరగలేదని ఆలయ అర్చకులు వారియోగుల వేణు మాధవ స్వామి పేర్కొన్నారు. సోమవారం ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రధాన అర్చకులుగా చెప్పుకొంటున్న వరియోగుల శ్రీనివాస స్వామి గతంలో అనేక అసభ్య పనులు చేస్తూ అర్చకుడిగా కొనసాగుతున్నారని విమర్శించారు. సదరు శ్రీనివాస స్వామి తనకు నచ్చినపుడు ఆలయానికి వస్తూ పూజా కార్యక్రమాలను అటకెక్కించారని ఆరోపించారు. గుట్టపై ఉన్న మూడు ఆలయాల్లో నాలుగు నెలలకు ఒకసారి ముగ్గురు అయ్యగార్ల మార్పు జరుగుతుందని తెలిపారు. అదే క్రమంలో జగన్నాదం రాము, జగన్నాథం కిరణ్ స్వామిలు గుట్టపైకి చేరుకొని అర్చనాధి కార్యక్రమాలు నిర్వహించార్నారు.






## 48 గంటల ధర్నా



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** మధ్యాహ్న భోజన కార్మికులకు పెండింగ్ లో ఉన్న గౌరవ వేతనంతోపాటు కోడి గుడ్ల బిల్లులను వెంటనే విడుదల చేయాలని, ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రాష్ట్ర ప్రభుత్వం రూ.10 గౌరవ వేతనం అందించాలని డిమాండ్ చేస్తూ సోమవారం హనుమకొండ కలెక్టరేట్ ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో వంటావార్పు నిర్వహించారు. సీఐటీయూ హనుమకొండ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో హనుమకొండ కలెక్టరేట్ మెయిన్ గేటుకు అడ్డంగా బైఠాయించి ధర్నా చేశారు. అయితే 48 గంటల పాటు నిరసన చేయరాదంటూ పోలీసులు వారించడంతో కార్మికులకు, పోలీసులకు మధ్య వాగ్వాదం జరిగింది. దీంతో కలెక్టరేట్ లోకి చొచ్చుకుపోయేందుకు మధ్యాహ్నం భోజన కార్మికులు ప్రయత్నించగా వారిని పోలీసులు బలవంతంగా అరెస్టు చేసి వాహనాల్లో సుబేదారి పోలీస్ స్టేషన్ కు తరలించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి రాగుల రమేష్, శ్రామిక మహిళ జిల్లా కన్వీనర్ నడిగొండ రజిత మాట్లాడుతూ రాష్ట్ర కమిటీ పిలుపుతో మధ్యాహ్న భోజన కార్మిలు పెద్ద ఎత్తున తరలివచ్చారన్నారు. వారికి నెలలు తరబడి బిల్లులు రాకపోవడంతో అప్పు చేసి ప్రభుత్వానికి ఎదురు పెట్టుబడి పెట్టి వంట చేసి పెడుతున్నారన్నారు. దీంతో కార్మికుల అప్పులపాలవుతున్నారన్నారు. తెచ్చిన అప్పులకు వడ్డీలు కట్టలేక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. గతంలో చేసిన వాటికే బిల్లులు రాలేదాని.. పైగా రాగిజావ పోయాలని బిల్లులు రాకపోయినా పిల్లలకు రెండు రకాల కూరలు వండి పెట్టాలని ఒత్తిడి చేస్తున్నారని ఆరోపించారు. బిల్లులు విడుదల చేయకుండా వంటలు ఎలా వండి పెడతారని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఇప్పటివరకు ఉన్న పెండింగ్ బిల్లులు క్లియర్ చేయాలని ప్రభుత్వాన్ని వారు డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ఎన్నికల ముందు కార్మికులకి పదివేల రూపాయలు నెలకు ఇస్తామని హామీ ఇచ్చి సంవత్సరం గడిచిన అమలు చేయలేదని తక్షణమే హామీని అమలు చేయాలని కోరారు. పెరిగిన ధరలు అనుగుణంగా పిల్లలకి ఇచ్చే మెనూ చార్జీలు పెంచడం లేదని కార్మికుల జీతాలు పెరగకపోగా ఉన్న జీతాలు కూడా నెలల తరబడి పెండింగ్ లో ఉన్నాయన్నారు. ఇచ్చే వేతనం తక్కువ అది కూడా రాకపోవడంతో కార్మికులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. తక్షణమే కాంగ్రెస్ ప్రభుత్వం స్పందించి కనీస వేతనం రూ.10వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. లేకుంటే పెద్ద ఎత్తున ఆందోళన, పోరాటం చేస్తామని హెచ్చరించారు. ఈ ధర్నా కార్యక్రమంలో మధ్యాహ్న భోజన కార్మికుల యూనియన్ జిల్లా అధ్యక్షురాలు పి.సమ్మక్క, సరిత, జి.శాంత, పర్వీన్, కవిత, ప్రేమలత, సంధ్య, లక్ష్మి, జి.సక్కుబాయి, రాధా, శ్రీలత, కొమరమ్మ, రేణుక, మంజుల, కవితలతోపాటు కార్మికులు పాల్గొన్నారు.

## ఘనంగా అయ్యప్ప.. నారి కేలి మహా పడిపూజ

**వరంగల్ వాయిస్, శాయంపేట :** శాయంపేట మండలంలోని పత్తిపాక గ్రామంలో సోమవారం అయ్యప్ప స్వామి నారికేలి మహా పడిపూజ పున్నం సాంబయ్య గురుస్వామి ఇంట్లో గురు స్వామి గోపాలకృష్ణ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ప్రత్యేకంగా పూలతో అలంకరించిన మండపంలో గణపతి లక్ష్మీదేవి అయ్యప్ప పటాలను అలంకరించి అయ్యప్ప స్వామికి పంచామృతాలతో 18 కలశాలతో అభిషేకం నిర్వహించినారు. అయ్యప్ప శరణు ఘోషతో గ్రామమంతా మారుమరోగింది. అనంతరం మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శ్రీ మత్స్యగిరి స్వామి దేవాలయ చైర్మన్ గురుస్వామి సామల భిక్షపతి, జిన్నా, శ్రీనివాస్ రెడ్డి, తోట రాజన్న, ఆకుల శివకుమార్, గట్టు కిషన్, మార్త సుమన్, బొల్లపెల్లి సదానందం, గోరంట్ల ప్రశాంత్, దండిగారి కిరణ్, దురిశెట్టి భిక్షపతి, శ్రీకాంత్, శ్రీధర్, వేణు, సాయి, వరుణ్ భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

